# కరెంట్ అఫైర్స్

## మోదీకి 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్'

- ఐక్యరాజ్యసమితి అందించే అత్యున్నత పర్యావరణ పురస్కారం 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డును 2018, అక్టోబరు 3న దిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ప్రదానం చేశారు.
- అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ - ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్)కి మార్గదర్శకత్వం వహించడంలో చొరవకు గుర్తింపుగా ఈసారి మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌కు సంయుక్తంగా పాలసీ లీడర్‌షిప్ కేటగిరీలో ఈ పురస్కారాన్ని ప్రకటించారు.
- సౌరశక్తి వినియోగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన కోచి విమానాశ్రయానికి కూడా 'ఎంటర్‌ప్రెన్యూరియల్ విజన్' కేటగిరీలో ఐరాస పురస్కారం లభించింది.
- ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ 2018, అక్టోబరు 1 నుంచి మూడు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు.

## ఆన్‌లైన్ చెల్లింపుల్లో భారత్ స్థానం 28

- ది ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ సర్వే - 2018 ప్రకారం ఆన్‌లైన్ చెల్లింపులు జరపడంలో ప్రభుత్వ పాత్రకు సంబంధించి 73 దేశాలతో కూడిన జాబితాలో భారత్ 28వ స్థానంలో నిలిచింది. 2011లో భారత్ ర్యాంకు 36.
- ఈ జాబితాలో నార్వే అగ్రస్థానంలో ఉంది. ఫ్రాన్స్, డెన్మార్క్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2011 తర్వాత ఈ సర్వేను మళ్లీ ఈ సంవత్సరంలోనే నిర్వహించారు.
- తాజా జాబితాలో వ్యాపార సంస్థల నుంచి ప్రభుత్వానికి చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. పౌరుల నుంచి ప్రభుత్వానికి జమ కావడంలో మూడో స్థానంలో నిలిచింది. డిజిటల్ మౌలిక సదుపాయాల్లో 58, సామాజిక - ఆర్థికాభివృద్ధిలో 60, విధానాల పరంగా 40వ స్థానంలో ఉంది.

## విపత్తు పన్ను విధింపు అధ్యయన బృందం

- ప్రకృతి విపత్తుల సమయంలో నిధుల సమీకరణకు విపత్తు పన్ను విధింపుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం 2018, సెప్టెంబరు 28న మంత్రుల బృందాన్ని (జీవోఎం) ఏర్పాటు చేసింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోదీ దీనికి నేతృత్వం వహిస్తారు. అక్టోబరు 31 నాటికి ఈ కమిటీ జీఎస్‌టీ మండలికి నివేదికను సమర్పిస్తుంది.
- ప్రకృతి విపత్తుల బారిన పడిన రాష్ట్రాలను ఆదుకునేందుకు కొన్ని వస్తువులపై అదనపు పన్ను విధించేందుకు చట్టబద్ధంగా ఉన్న అవకాశాలను పరిశీలించడానికి కమిటీని ఏర్పాటు చేయాలని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి 30వ సమావేశంలో నిర్ణయించిన నేపథ్యంలో ఈ కమిటీ ఏర్పాటైంది. జీఎస్టీ మండలి లేవనెత్తిన పలు కీలకాంశాలను మంత్రుల బృందం పరిశీలించనుంది.
- అసోం ఆర్థికమంత్రి హిమంత బిశ్వశర్మ, కేరళ ఆర్థికమంత్రి థామస్ ఇసాక్, పంజాబ్ ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్, మహారాష్ట్ర ఆర్థికమంత్రి సుధీర్ ముర్గా నిత్వార్, ఉత్తరాఖండ్ ఆర్థికమంత్రి ప్రకాష్ పంత్, ఒడిశా ఆర్థికమంత్రి శశిభూషణ్ బెహరా ఈ కమిటీలో సభ్యులు.

## ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త

- భారత సంతతికి చెందిన గీతా గోపీనాథ్ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) సంస్థ ప్రధాన ఆర్థికవేత్త (చీఫ్ ఎకనామిస్ట్)గా 2018, అక్టోబరు 1న నియమితులయ్యారు. రఘురామ్ రాజన్ (ఆర్‌బీఐ మాజీ గవర్నర్) తర్వాత ఈ పదవిని చేపడుతున్న రెండో భారతీయ వ్యక్తి ఈమే.
- ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా ప్రస్తుతం కొనసాగుతున్న మౌరిస్ అబ్స్‌ట్‌ఫెల్డ్ ఈ ఏడాది చివర్లో పదవీ విరమణ చేస్తారు. అనంతరం గీత బాధ్యతలు స్వీకరిస్తారు.

## ఐఎన్ఎస్ అధ్యక్షుడిగా జయంత్

- ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) అధ్యక్షుడిగా మలయాళ మనోరమ పత్రికకు చెందిన జయంత్ మమ్మెన్ మాథ్యూ ఎన్నికయ్యారు. 2018 – 19 ఏడాదికి ఈయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. 2018, సెప్టెంబరు 28న బెంగళూరులో జరిగిన ఐఎన్ఎస్ 79వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.
- డిప్యూటీ అధ్యక్షుడిగా శైలేష్ గుప్తా (మిడ్ డే), ఉపాధ్యక్షుడిగా ఎల్. ఆదిమూలం (హెల్త్ అండ్ ది యాంటీసెప్టిక్) ఎన్నికయ్యారు.

## పీటీఐ ఛైర్మన్‌గా ఎన్.రవి

- ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ) ఛైర్మన్‌గా హిందూ గ్రూప్ పత్రికల ప్రచురణకర్త ఎన్.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా పంజాబ్ కేసరి గ్రూప్ పత్రికల ప్రధాన సంపాదకుడు విజయ్‌కుమార్ చోప్రా ఎన్నికయ్యారు.

## ఏపీ ప్రధాన కార్యదర్శిగా పునేఠ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా అనిల్ చంద్ర పునేఠ 2018, సెప్టెంబరు 30న బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ పొందిన ప్రస్తుత సీఎస్ దినేష్ కుమార్ నుంచి ఈయన బాధ్యతలు స్వీకరించారు.
- పునేఠ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టక ముందు భూపరిపాలన ప్రధాన కమిషనర్‌గా విధులను నిర్వర్తించారు. 2019, మే వరకు సీఎస్‌గా కొనసాగనున్నారు.

## స్వచ్ఛతా ర్యాంకింగ్స్ - 2018

- కేంద్రం నిర్వహించిన గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ χ 2018 స్వచ్ఛతా ర్యాంకింగ్స్‌లో దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. దేశవ్యాప్తంగా ఈ రాష్ట్రాలు 6, 8 స్థానాల్లో ఉన్నాయి.
- ఈ సర్వేక్షణ్‌లో ఏపీ 82.57%, తెలంగాణ 81.48% మార్కులు సాధించాయి. జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో హరియాణా, గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ వరుసగా తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి. స్వచ్ఛతా ఐకాన్ విభాగంలో దేశంలోనే తొలి స్థానంలో చార్మినార్ నిలిచింది.

## ఇండోనేషియాలో మరోసారి సునామీ

- 2018, సెప్టెంబరు 28న ఇండోనేషియాలోని సులవేసి ద్వీపంలో సంభవించిన భూకంపం, సునామీలతో ఇండోనేషియా వణికింది. రిక్టర్ స్కేలుపై 7.5 తీవ్రతతో భూకంపం, ఆ వెంటనే 4 – 6 మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడి సునామీ రావడంతో సుమారు 1400 మంది మృతిచెందారు. లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈ విపత్తులతో పలూ పట్టణం తీవ్రంగా దెబ్బతింది.
- 2004, డిసెంబరు 26న (బాక్సింగ్ డే) 9.3 తీవ్రతతో వచ్చిన భూకంపం, ఆ తర్వాత 24 మీటర్ల ఎత్తులో విరుచుకుపడిన అలల ధాటికి ఇండోనేషియా వ్యాప్తంగా సుమారు 2 లక్షల మంది మరణించారు.

## మహాత్మాగాంధీ 149వ జయంతి

- మహాత్మాగాంధీ 149వ జయంతిని 2018, అక్టోబరు 2న దేశ, విదేశాల్లో ఘనంగా నిర్వహించారు. సంవత్సరం పాటు జరిగే 150వ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి.
- ఈ సందర్భంగా మహాత్మాగాంధీ బాగా ఇష్టపడిన 'వైష్ణవ జనతో...' భజన కీర్తనను 40 దేశాల దిగ్గజ గాయకులు ఆలపించగా, 124 దేశాల విద్యాంసులు అందించిన సంగీతాన్ని మేళవించి రూపొందించారు. అయిదు నిమిషాల నిడివి ఉన్న ఈ ఫ్యూజన్ వీడియోను దిల్లీలో జరిగిన 'మహాత్మాగాంధీ అంతర్జాతీయ పారిశుద్ధ్య సదస్సు' ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ ఆవిష్కరించారు. 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ గుజరాతీ కవి నరసింహ మెహతా ఈ గీతాన్ని రాశారు.
- గాంధీ జయంతిని పురస్కరించుకుని అసోం సీఎం శర్బానంద సోనోవాల్ గువాహటిలో 319.5 అడుగుల ఎత్తైన స్తంభంపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇది దేశంలోనే పొడవైన మూడో స్తంభంగా రికార్డులకెక్కింది. అట్టారిలో ఏర్పాటుచేసిన 360 అడుగుల స్తంభం, పుణెలోని 351 అడుగుల పొడవైన స్తంభం మొదటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

- నల్గొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గాంధీ వేషధారులైన 5,500 మంది విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ బుక్‌లో స్థానం పొందింది.
- ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు 'ముఖ్యమంత్రి యువనేస్తం' పథకాన్ని ఉండవల్లిలోని ప్రజా వేదికలో ప్రారంభించారు.

**భారత్‌కు ఎస్-400 క్షిపణి వ్యవస్థ**

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ రెండు రోజుల భారత పర్యటన నిమిత్తం 2018, అక్టోబరు 4న దిల్లీ చేరుకున్నారు.
- అక్టోబరు 5న 19వ వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సదస్సును దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించారు. మోదీ, పుతిన్‌లు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రష్యా నుంచి ఎస్-400 ట్రయంఫ్ అనే అధునాతన గగనతల క్షిపణి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేసేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విలువ రూ. 36.9 వేల కోట్లు.
- ఎస్–400 కాకుండా భారత్, రష్యాల మధ్య మరో ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. అంతరిక్షం, అణుశక్తి, రైల్వే రంగాలకు సంబంధించిన అంశాలు వీటిలో ఉన్నాయి. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మానవ సహిత అంతరిక్ష యాత్ర ప్రాజెక్టు 'గగన్‌యాన్'కు సహకారం అందించేందుకు రష్యా అంగీకరించింది.

**అరంగేట్ర టెస్టులోనే సెంచరీ చేసిన పృథ్వీ షా**

- 2018, అక్టోబరు 4న రాజ్‌కోట్‌లో వెస్టిండీస్‌తో ప్రారంభమైన మొదటి టెస్టు మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన పృథ్వీ షా తన తొలి టెస్టు మ్యాచ్‌లోనే సెంచరీ (134 పరుగులు) నమోదు చేసి వార్తల్లో నిలిచాడు.
- భారత్ తరపున అరంగేట్ర టెస్టు మ్యాచ్‌లో సెంచరీ చేసిన పిన్న వయస్కుడు (18 ఏళ్ల 329 రోజులు) పృథ్వీనే. సచిన్ తెందూల్కర్ (17 ఏళ్ల 112 రోజులు) తర్వాత భారత్ తరపున టెస్టు సెంచరీ సాధించిన రెండో పిన్న వయస్కుడు ఇతడు. ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత చిన్న వయసులో సెంచరీ చేసిన ఆటగాళ్లలో పృథ్వీ ఏడోవాడు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net